## మా వూళ్ళో ఒక్కసారి దిగండి

భువనేశ్వర్ వెడదామని ఎక్కిన కోణార్క ఎక్స్‌ప్రెస్‌లో, పై బెర్తు క్రింది బెర్తు అడ్జస్టుమెంటు దగ్గిర సోమరాజుగారితో తగాదా వచ్చింది. ఐతే కాజీపేటలోగా అతను ఫ్రెండై పోయి, వెళుతున్నప్పుడు బ్రేక్‌జర్నీ చేసో, వస్తున్నప్పుడు ప్రోగ్రాం వేసుకోనో, వైజాక్‌లో ఒక్కసారి దిగి తన ఆతిథ్యం స్వీకరించమని కోరాడాయన. వైజాగ్‌లో తెలిసినవాళ్ళు, బంధువులు, కిత్తూ, కిన్నూ కాకపోయినా కొందరున్నారు. అంచేత తిరిగొస్తూ దిగాను.

మంచి సమయాని కొచ్చారు. ఇవాళ మూడు ముఖ్యమైన మీటింగు లున్నాయి. ఈ వూళ్ళో స్మరంతి- అనదగ్గ ప్రతి ముఖ్యలు మీకు పరిచయమౌతారు !" అని నన్ను రెడీ చేశారు సోమరాజుగారు.

"మెదడువాపు" వ్యాధి గురించి మొదటి మీటింగు. "ఈ జబ్బు దోమల ద్వారా వస్తుందని తెలుస్తోంది. మన వూళ్ళో దోమల నివారణ కోసం ఈ ఏడాది పదిలక్షల రూపాయలు ఖర్చుచేశాం. రూపాయికి 10 దోమల చొప్పున మొత్తం ఒక కోటి దోమల్ని జయించాం" అని స్టాటిస్టిక్స్ వివరించారో కాయన.

"మరి ఇందాక మనం వస్తున్నప్పుడు అదేదో మృత్యు గహ్వరం, నారీకేళ వనం, తొమ్మిది రంగుల సినిమాహాలు అవన్నీ

తిరిగొచ్చాం కదా, అక్కడ మనకి కనబడ్డ దోమలు పదికోట్లకి పైగా ఉంటాయే, వాటిని జయించే దెప్పుడో!" అన్నాను.

"మీరనేది చావులమదుం, కొబ్బరితోట, నవరంగ్ సినిమా ప్రాంతాలేగా! అక్కడి ప్రజలకి దోమకాటు గురించి ఆలోచించే తీరిక వుండదు. అంచేత నో ప్రాబ్లెం!" అని సోమరాజుగారు నన్ను సముదాయించారు.

బీచి ఒడ్డున బ్రహ్మాండమైన డబుల్ రోడ్డుంది. ఆ రోడ్డు రెండు పాయలకీ మధ్య సుమారు మైలు పొడుగున చిక్కిపోయిన చక్కనమ్మలా ఒక సన్నటి పార్కుంది. ఆ పార్కులో గడ్డి, పూల మొక్కలు చాలునా, లేక ఇంకా అభివృద్ధి అవసరమా అనే విషయంపై ఒక సెమినార్ చేసేరు. కేవలం రెండు రూపాయలకు కప్పు కాఫీ, రెండు రూపాయలన్నరకే ఒక సీసా గోల్డ్‌స్పాట్, మూడు రూపాయలకే ఒక కప్పు ఐస్‌క్రీం సరఫరాచేసే శ్నాక్‌బార్ ఒకటి బీచిలోనే వుంది. అక్కడ రెండువేల రూపాయల బిల్లు చేశారు. సెమినార్‌లో పాల్గొన్న పండితులూ, అధికార్లూనూ వాళ్ళ మధ్య నన్ను కూర్చోపెట్టిన సోమరాజుగారి పట్ల కృతజ్ఞతతో నా గుండె బరువెక్కి బద్దలైనంత పనైంది.

పార్కులో గడ్డి, పూలమొక్కలు బతకడానికి నీరు కావాలి. పక్కనే సముద్రం వుంది. కాని ఉప్పు నీటితో పార్కులు పెరగవని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. అంచేత వున్నంతలో కొంత ఇబ్బంది పడైనాసరే నారుపోసిన పురపాలక సంఘంవారే పార్కుకు నీరుకూడా పొయ్యాలని తీర్మానం జరిగింది.

"పదండి, మనం పోదాం మూడో మీటింగ్‌కి టైమవుతోంది" అని కారు దగ్గిరికి నడిచారు సోమరాజుగారు. మళ్ళీ పార్కు చూద్దామని అటే వెళ్ళాం. పొందికైన మాలి ఒకడు అందమైన కూతురుచేత, మందంగా వున్న రబ్బరుగొట్టాం పట్టించి సుందరమైన పార్కులో ఎందుకో తెలియకుండా ఎదుగుతున్న గడ్డికి నీళ్లు కొట్టిస్తూ వుంటే మందహాసంతో ఆ దృశ్యం తిలకించి పులకించారు సోమరాజుగారు.

ఆ దృశ్యం అదృశ్యం అయిపోతుందేమోనని భయపడ్డట్టు కారును ఆపారు.

"బాబూ! చూడండి, ఈ పక్కన కృష్ణానగర్‌లో వుంటున్నాం. మాకు ఇళ్ళల్లో కొళాయి లున్నాయిగాని తాగడానికి నీళ్ళు రావు. ఇక్కడ మొక్కలకీ, గడ్డికీ కుళ్ళిపోయేటంత నీరు పోసేస్తున్నారు. ఊళ్ళో ఎక్కడా నీళ్లు దొరకడంలేదని లారీలు ఇక్కడికి తెచ్చి కడుక్కుంటున్నారు. ఈ దురాచారం ఆపరా?" అంటూ వచ్చిం దొకావిడ.

"ఏమిటమ్మా, అదొక పెద్ద సమస్యలాగా చెప్తారు! లారీ వాళ్ళ లాగే మీరు కూడా మాలి చేతిలో రూపాయో, రెండో పడేసి మీకు కావల్సినన్ని నీళ్లు బిందెలతో మోసుకుపోండి. ఎవరొద్దన్నారు!" అని కారు స్టార్ట్ చేశారు సోమరాజుగారు.

హాస్పిటల్ దగ్గిర జనం, కారు పోవడానికి వీల్లేకుండా మూగారు. ఏమిటి సంగతని అడగ్గా సిటీబస్ కిందపడి ఇవాళ ఉదయం ఇద్దరు మరణించారని తెలిసింది. ఎలా పోయారు. వాళ్లు దేశానికి పనికొచ్చే వ్యక్తులేనా అని విచారించడంలో, అయ్యో ఇద్దరు మనుష్యులు అన్యాయంగా బలైపోయారే అన్న విచారం మసుగుపడి పోయింది.

"ఈ వూళ్ళో ముక్తి మార్గాలెన్ని వున్నాయి?" అని అడిగాను.

"సిటీబస్సు రూట్లేనా? నలభై?" అన్నారు సోమరాజుగారు.

మూడో మీటింగ్ కెళ్ళాం. మామూలుగా ప్రతి వూళ్లోనూ పని చేసే మనిషికి వారానికి ఒకరోజు శలవుంటుంది. ఈ వూళ్లో ఆది వారంకాక, వారంలో ఏదో ఒకరోజు, సిటీబస్ యాక్సిడెంట్ల కారణంగా జరిపే బంద్ సందర్భంగా రెండో రోజు శలవు కూడా లభించడం ఈ నగరంలోని విశేషం అని ఒకాయన ఉద్ఘాటించాడు. ఆ రాత్రే హైదరాబాద్‌కి తిరుగు ప్రయాణం కట్టాను.

"మళ్ళీ ఎప్పుడైనా మా వూళ్లో, ఒక్కసారి దిగండి" అన్నారు సోమరాజుగారు, నన్ను రైలెక్కిస్తూనూ.

(9-12-78)